బుచ్చిరెడ్డిపాళెం అభివృద్ధికి
కూటమిని
గెలిపించండి



04

RNI: APTEL/26/A8235

# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

అక్షర దర్శిని
దినపత్రికలో పని చేయడానికి
అనుభవం కలిగిన, జర్నలిజంపై
ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను.
కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
9912808090
8374168090

నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -24 | శుక్రవారం 23 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్మయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-



## కూటమి పాలనలో ప్రజాస్వామ్యానికి విఘాతం: కాకాణి

▶▶ వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణ

**నెల్లూరు,(అక్షర దర్శిని):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తోందని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డా. కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం తనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసిన నేపథ్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, దాడులు, బెదిరింపులకు పాల్పడటం వంటి ఘటనలు జరుగుతున్నాయని కాకాణి ఆరోపించారు. గూడూరు, సూళ్లూరుపేట సహా పలు ప్రాంతాల్లో నామినేషన్ల సందర్భంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం, పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నామినేషన్ల తిరస్కరణలో నిబంధనలు పాటించడం లేదని, అభ్యర్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. నామినేషన్ పత్రాలు చించివేసిన ఘటనలపై కేసులు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసే వరకు పార్టీ శ్రేణులు సమష్టిగా పోరాడతాయని కాకాణి స్పష్టం చేశారు. సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు.



## సర్వేపల్లిలో టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరికలు

### కోడూరు నుంచి 30, తోటపల్లి నుంచి 25 కుటుంబాలు టీడీపీలో చేరిక

### అల్లీపురంలో పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**నెల్లూరు,(అక్షర దర్శిని):** సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లిగూడూరు మండలంలో వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కోడూరు పంచాయతీ నుంచి 30 కుటుంబాలు, తోటపల్లి పంచాయతీ నుంచి 25 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అల్లీపురంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో తోటపల్లికి చెందిన శ్రీరాములు నాయుడు, అగరం చంద్రబాబు నాయుడు, సుమన్, సీతారామయ్యతో పాటు కోడూరుకు చెందిన దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, తేలిమేటి



నాగభూషణం, ఎంబేటి శివరావు, కైలాసం ఏడుకొండలు, తేలిమేటి మల్లికార్జున, నెల్లిపూడి వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీధర్‌కుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల వేళ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరడం సంతోషకరమన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ

▶▶ మిగతా 4 లో.......

## అభివృద్ధి కొనసాగాలంటే కూటమికి మద్దతివ్వండి

▶▶ 9, 10, 11వ డివిజన్లలో కూటమి అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

▶▶ పూలవర్షం, మంగళహారతులతో నాయకులకు స్వాగతం

▶▶ షరిణి పొంగూరు

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతివ్వాలని షరిణి పొంగూరు ప్రజలను కోరారు. రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలో నగరంలోని 9, 10, 11వ డివిజన్లలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. సత్యనారాయణపురం, రివర్స్ కాలనీ, పప్పుల వీధి ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్, 9వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి శశికుమార్, 10వ డివిజన్ అభ్యర్థి కిన్నెర కోటేశ్వరి, 11వ డివిజన్ అభ్యర్థి కొండ గీతిక పాల్గొన్నారు. ప్రచారం సందర్భంగా పలుచోట్ల స్థానికులు పూలవర్షం కురిపిస్తూ, మంగళహారతులతో నాయకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షరిణి పొంగూరు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నెల్లూరును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌తో పాటు

▶▶ మిగతా 4 లో.......





## తాటిపర్తి బిట్-1 ఎంపీటీసీ అభ్యర్థిగా ఉయ్యాల ప్రతాప్‌రెడ్డి నామినేషన్

▶▶ వైఎస్సార్‌సీపీ తరఫున నామినేషన్ దాఖలు

**పొదలకూరు,(అక్షర దర్శిని):** పొదలకూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి కొనసాగుతోంది. మండలంలోని తాటిపర్తి బిట్-1 ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉయ్యాల ప్రతాప్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. పొదలకూరు మండల జడ్పీటిసి  అభ్యర్థి బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని)పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకున్న ఆయన ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనకు మద్దతు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పొదలకూరులో ఎన్నికల భద్రతపై పోలీసుల ప్రత్యేక నిఘా

- నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు..
- భద్రతా ఏర్పాట్లపై సీఐ, ఎస్సైలకు కీలక సూచనలు..

**పొదలకూరు,(అక్షర దర్శిని):** పరిషత్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పొదలకూరు మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియను నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. నామినేషన్ల దాఖలు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు సూచించారు. నామినేషన్ల స్వీకరణతో పాటు పరిశీలన సమయంలోనూ భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అభ్యర్థులు, వారి అనుచరుల రాకపోకలను పర్యవేక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పొదలకూరు సీఐ గుత్తి వెంకట్రావు, ఎస్సై శివ రాకేష్‌లకు భద్రతా నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. పరిషత్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తూ, నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలపై దృష్టి సారించిందని ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు.

## నూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసరెడ్డిని కలిసిన విజయలక్ష్మి గునుకుల





**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో 21వ డివిజన్ నుంచి కూటమి బలపరిచిన జనసేన పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా బీఫామ్ అందుకున్న విజయలక్ష్మి గునుకుల, నెల్లూరు నూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతానని విజయలక్ష్మి గునుకుల పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, డివిజన్ అభివృద్ధికి కృషి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. కూటమి తరఫున జనసేన పార్టీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న ఆమె, ప్రజా సేవకు ప్రాధాన్యమిస్తూ ఎన్నికల్లో ముందుకు సాగనున్నట్లు వెల్లడించారు.

## కలువాయి జడ్పీటీసీ అభ్యర్థిగా అరవ లిఖిత నామినేషన్

- టీడీపీ తరఫున నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో పత్రాల సమర్పణ



**కలువాయి,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా కలువాయి జడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కాలువ గ్రామానికి చెందిన అరవ లిఖిత నామినేషన్ దాఖలు చేశారు. జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్న ఆమె, అవసరమైన పత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించారు. కలువాయి మండలం నుంచి టీడీపీ అభ్యర్థిగా అరవ లిఖిత ఎన్నికల బరిలో నిలవడంతో స్థానిక రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది. నామినేషన్ దాఖలు సందర్భంగా ఆమె భర్త డాక్టర్ రాజేష్, మల్లికార్జున్ యాదవ్ వెంట ఉన్నారు. జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో కలువాయి మండలంలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తూ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటమే లక్ష్యంగా ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు కార్యాచరణ చేపడుతున్నాయి. కలువాయి జడ్పీటీసీ స్థానానికి అరవ లిఖిత నామినేషన్ దాఖలు చేయడంతో మండలంలో ఎన్నికల సందడి మరింత పెరిగింది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది.

# పరిషత్ ఎన్నికల నేపథ్యంలో...-పొదలకూరులో పోలీసు కవాతు..



- ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం..
- ప్రజల్లో భద్రతా భావం కల్పించేందుకు చర్యలు..
- సీఐ గుత్తి వెంకట్రావు, ఎస్ఐ శివ రాకేష్ వెల్లడి..

**పొదలకూరు,(అక్షర దర్శిని):** రాష్ట్రవ్యాప్త స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నవంబర్ 3వ తేదీన పొదలకూరు మండలంలో జరగనున్న పరిషత్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించడమే లక్ష్యంగా గురువారం సాయంత్రం పొదలకూరులో పోలీసు కవాతు నిర్వహించారు. సీఐ గుత్తి వెంకట్రావు పర్యవేక్షణలో సీఐ శివ రాకేష్ తన సిబ్బందితో కలిసి స్థానిక రామ్ నగర్ సెంటర్ నుంచి సంగం రోడ్ సెంటర్ వరకు కవాతు చేపట్టారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతా భావం కల్పించడం, అసాంఘిక శక్తులకు హెచ్చరిక పంపడం, ఓటర్లను ప్రలోభాలకు లేదా భయభ్రాంతులకు గురిచేసే చర్యలను అడ్డుకోవడం వంటి లక్ష్యాలతో ఈ కవాతు నిర్వహించినట్లు ఎస్సై రాకేష్ తెలిపారు. పోలీసు శిక్షణలో నేర్చుకున్న క్రమశిక్షణ, వ్యూహాలను గుర్తుచేస్తూ.. తక్కువ మంది సిబ్బందితోనూ పరిస్థితులను సమర్థంగా నియంత్రించే విధానాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రజలు ఎలాంటి భయం, ఒత్తిడికి లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో వినియోగించుకోవచ్చని పోలీసులు భరోసా కల్పించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.




# నిరాడంబరతకు, నిజాయితీకి ప్రతిరూపం ఎస్.ఆర్. శంకరన్

- పేదలు, అణగారిన వర్గాల సంక్షేమానికి జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ ఐఏఎస్ అధికారి
- ఆయన సేవలు నేటి అధికారులకు స్ఫూర్తిదాయకం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

**నెల్లూరు,(అక్షర దర్శిని):** పేదలు, అణగారిన వర్గాల సంక్షేమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గురువారం శంకరన్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ కలెక్టర్ ప్రకటన విడుదల చేశారు. నిరాడంబరత, నిజాయితీ, నిబద్ధతకు ప్రతిరూపంగా నిలిచిన శంకరన్.. అధికారమంటే హోదా, ఆర్భాటం కాదని, ప్రజలకు సేవ చేయడమే నిజమైన బాధ్యతని తన జీవితం ద్వారా చాటిచెప్పారని తెలిపారు. 1934 అక్టోబర్ 22న తమిళనాడులోని తంజావూరు జిల్లాలో జన్మించిన శంకరన్.. 1957లో ఐఏఎస్ అధికారిగా ఎంపికై వివిధ హోదాల్లో సేవలందించారు. జిల్లా కలెక్టర్ నుంచి ప్రభుత్వ ఉన్నతస్థాయి పదవుల వరకు బాధ్యతలు నిర్వహించిన ఆయన, పదవీ విరమణ అనంతరం కూడా పేదల హక్కుల పరిరక్షణకు కృషి చేశారు. తన పెన్షన్‌లో కొంత భాగాన్ని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమానికి అందిస్తూ సామాజిక సేవలో తన అంకితభావాన్ని చాటుకున్నారు. ఉన్నత పదవుల్లో పనిచేసినా సాధారణ జీవనశైలిని అనుసరించడం, సామాన్యుల పట్ల గౌరవంగా వ్యవహరించడం ఆయన ప్రత్యేకతలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇతరుల శ్రమను గౌరవిస్తూ, మానవత్వానికి ప్రాధాన్యతనిచ్చిన ఆయన జీవన విధానం అందరికీ ఆదర్శమన్నారు.

**కలెక్టరేట్‌లో శంకరన్ హాల్ :** ఎస్.ఆర్. శంకరన్ సేవలను స్మరించుకుంటూ నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లోని ఒక హాల్‌కు 'శంకరన్ హాల్'గా నామకరణం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పేదల సంక్షేమం, సామాజిక న్యాయం, నిరాడంబరత పట్ల ఆయన చూపిన నిబద్ధత ప్రభుత్వ యంత్రాంగానికి స్ఫూర్తిదాయకమన్నారు. 2010 అక్టోబర్ 7న శంకరన్ కన్నుమూసినా, పేదల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలనే సందేశాన్ని ఆయన జీవితం అందిస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.



# మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతపై పోలీసుల ప్రత్యేక అవగాహన





- శక్తి యాప్ వినియోగంపై విస్తృత ప్రచారం.. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా నివారణపై చైతన్యం

**నెల్లూరు,(అక్షర దర్శిని):** మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఎస్పీ డా. అజిత వెజెండ్ల, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సీహెచ్. సౌజన్య సూచనలతో జిల్లా వ్యాప్తంగా శక్తి యాప్, ఆపరేషన్ చిన్నారి తల్లి, ఆపరేషన్ దండాయన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భద్రతపై చైతన్యం కల్పిస్తున్నారు. నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, గూడూరు, కావలి సబ్ డివిజన్ల పరిధిలో శక్తి బృందాలు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నాయి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, ఇతర జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతపై ప్రజలకు వివరిస్తున్నారు. శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే విధానం, అందులోని భద్రతా సదుపాయాలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందే విధానంపై అవగాహన కల్పిస్తూ యాప్ రిజిస్ట్రేషన్‌కు ప్రోత్సహిస్తున్నారు.

**చిన్నారుల రక్షణకు ప్రత్యేక చర్యలు**

ఆపరేషన్ చిన్నారి తల్లి, ఆపరేషన్ దండాయన కార్యక్రమాల ద్వారా చిన్నారులపై జరిగే నేరాలను గుర్తించడం, నివారించడం, బాధితులకు తక్షణ సహాయం అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిరోధం, పోక్సో చట్టంపై విద్యార్థినులు, మహిళలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. చిన్నారుల పట్ల అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే నిర్లక్ష్యం చేయకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచిస్తున్నారు. చిన్నారుల భద్రత కుటుంబ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరిస్తూ ప్రజల భాగస్వామ్యంతో నేరాల నివారణకు కృషి చేస్తున్నారు.

**అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైన్‌లను వినియోగించుకోవాలి**

మహిళలు, బాలికలు, చిన్నారులు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు తక్షణ సహాయం పొందేందుకు 112 అత్యవసర పోలీసు సేవలను సంప్రదించాలని పోలీసులు సూచిస్తున్నారు. చిన్నారుల రక్షణ కోసం 1098, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని కోరుతున్నారు. మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రత కోసం పోలీసు శాఖ అందిస్తున్న సేవలు, సాంకేతిక సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద ఘటనలను పోలీసులకు తెలియజేయడం ద్వారా నేరాల నియంత్రణలో సహకరించాలని జిల్లా పోలీసు శాఖ పిలుపునిచ్చింది.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీని గెలిపించండి..





- అభివృద్ధికి పట్టం కట్టండి.. కూటమి అభ్యర్థులను ఆదరించండి..
- మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు పిలుపు..

**పొదలకూరు,(అక్షర దర్శిని):** రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. పొదలకూరు మండలంలోని నేదురుమల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా దామినేని శ్రీదేవమ్మ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఆమెకు మద్దతు తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి మస్తాన్ బాబు మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ తరఫున పొదలకూరు జెడ్పీటీసీ అభ్యర్థిగా కలిచేటి ప్రభాకర్ రెడ్డి, నేదురుమల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా దామినేని శ్రీదేవమ్మ ఎన్నికల బరిలో ఉన్నారని తెలిపారు. మండలంలో అభివృద్ధి జరిగిందంటే అది ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హయాంలో నేనని అన్నారు . సాగునీరు, తాగునీరు, విద్య, వైద్య రంగాలతో పాటు పట్టణ అభివృద్ధికి సోమిరెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. పొదలకూరు పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ప్రాజెక్టు మంజూరు కావడంలోనూ ఆయన కృషి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందాలంటే జడ్పిటిసి తోపాటు మండలంలోని 19 మంది ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించి ప్రజలు తమ మద్దతు తెలియజేయాలని కోరారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో స్థానిక సంస్థల్లో అరాచకం, అక్రమాలు రాజ్యమేలాయని మస్తాన్ బాబు విమర్శించారు. ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న తెలుగుదేశం పార్టీకి ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి కొనసాగాలన్నా, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలన్నా టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

## బిరదవోలు ఎంపీటీసీ వైసీపీ అభ్యర్థిగా ముడి రమ నామినేషన్



**పొదలకూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు మండలంలో నామినేషన్ల సందడి కొనసాగుతోంది. మండలంలోని బిరదవోలు ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ముడి రమ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్ఆర్సిపి సర్వేపల్లి ఐటి వింగ్ అధ్యక్షులు రావుల ఇంద్రసేనా గౌడ్,పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకున్న ఆమె ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు ఆమెకు మద్దతు తెలిపారు. రానున్న ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బిరదవోలు ఎంపీటీసీ స్థానంపై రాజకీయ ఆసక్తి నెలకొంది.

## సంగంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

- మంత్రి ఆనం నాయకత్వానికి వైఎస్సార్‌సీపీ నేత శివకుమార్ రెడ్డి మద్దతు



**నెల్లూరు,(అక్షర దర్శిని):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం మండలంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. సంగం మండల మాజీ సొసైటీ అధ్యక్షుడు, ప్రముఖ నాయకుడు పందిళ్ళపల్లి శివకుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నాయకత్వానికి మద్దతు ప్రకటించారు.బుధవారం నెల్లూరులోని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో శివకుమార్ రెడ్డి, ఆయన అనుచరులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మంత్రి ఆనం బలపరిచే తెలుగుదేశం పార్టీ, ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి తమవంతు సహకారం అందిస్తామని వెల్లడించినట్లు సమాచారం.ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి ఆనం చేస్తున్న కృషికి ఆకర్షితులై ఆయన నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు వారు పేర్కొన్నారు. సంగం మండలంలో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# సర్వేపల్లిలో వైసీపీలోకి టీడీపీ నేతల వలసలు









- దుగ్గుంట పంచాయతీ ఊట్లపాలెం నుంచి 30 కుటుంబాల చేరిక
- 32 ఏళ్లుగా టీడీపీలో కొనసాగిన సీనియర్ నేతలూ వైసీపీలో చేరిక
- సర్వేపల్లిలో వైసీపీ బలపడుతోందన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**నెల్లూరు,(అక్షర దర్శిని):** సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. పొదలకూరు మండలం దుగ్గుంట పంచాయతీ పరిధిలోని ఊట్లపాలెం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు గురువారం నెల్లూరులో మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ మాజీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో వైసీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి కాకాణి కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో టీడీపీలో 32 సంవత్సరాలుగా కొనసాగిన సీనియర్ నాయకులు తోట గోపాలయ్య, తోట భాస్కర్, తోట రమేష్, తోట హరీష్, తోట రవి, బోనబోయిన సుబ్రమణ్యం, బోనుబోయిన వినోద్, మితాత్మకూరు వెంకటేశ్వర్లు, కంట్రాంతి రమణయ్య తదితరులు ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**టీడీపీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి: కాకాణి** ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, సాధారణంగా ప్రతిపక్ష పార్టీ నాయకులు అధికార పార్టీలోకి వెళ్తుంటారని, అయితే సర్వేపల్లిలో అందుకు భిన్నంగా అధికార పార్టీని వీడి ప్రతిపక్ష వైసీపీలో చేరడం తనకు సంతోషంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు పెరిగాయని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో లేవని ప్రజలు అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు.అధికారంలో ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉండగానే టీడీపీని వీడి వైసీపీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుందని అన్నారు. సర్వేపల్లిలో వైసీపీ క్రమంగా బలపడుతోందని, 2029 ఎన్నికల నాటికి పార్టీ మరింత పట్టు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీలోకి జరుగుతున్న చేరికలపై కూడా కాకాణి విమర్శలు చేశారు. కొందరిని భయపెట్టి, బెదిరించి ఆ పార్టీలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. అయితే, సుదీర్ఘకాలంగా టీడీపీలో కొనసాగిన నాయకులు ఇప్పుడు వైసీపీలో చేరడం ఆ పార్టీ పరిస్థితిని సూచిస్తోందని వ్యాఖ్యానిం చారు. రానున్న ఎన్నికల్లో సర్వేపల్లి ప్రజలు టీడీపీకి తగిన సమాధానం చెబుతారని అన్నారు.



## సంగం రహదారి.. అధ్వానం..

- చెత్తాచెదారం,దుర్వాసనతో ప్రయాణికుల అవస్థలు..
- పట్టించుకోని అధికారులు
- ప్రమాదాలకు దారితీస్తున్న రోడ్డు పక్కన చెత్త కుప్పలు

**పొదలకూరు,(అక్షరదర్శిని):** పొదలకూరు నుంచి సంగం, ఆత్మకూరుకు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి అధ్వానంగా మారుతోంది. రహదారి పక్కనే చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, రహదారి పరిస్థితి మాత్రం రోజురోజుకూ దారుణంగా మారుతోంది.రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో చెత్త కుప్పలు పెరిగిపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం రోడ్డుపైకి చేరుతుండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. చెత్తకు నిప్పంటించడంతో పొగ రహదారిపైకి వ్యాపించి వాహనదారుల కంటిచూపును సైతం ఇబ్బంది పెడుతోంది.రహదారి వెంబడి చెత్త పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన నెలకొంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. చెత్త కుప్పల కారణంగా దోమలు, ఈగలు పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రహదారి పక్కన చెత్త పేరుకుపోవడం వల్ల రోడ్డుపైకి వ్యర్థాలు, మట్టి చేరుతున్నాయి. దీంతో వాహనాలు అదుపుతప్పే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

**పట్టించుకోని అధికారులు**

ప్రధాన రహదారి పరిస్థితిపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు, మళ్లీ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సంగం ప్రధాన రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని, పారిశుద్ధ్య చర్యలను క్రమం తప్పకుండా చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కలువాయిలో రెండో రోజు 20 ఎంపీటీసీ నామినేషన్లు

- టీడీపీ మండల అధ్యక్షుడు చల్లా రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్లు
- నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు

**కలువాయి,(అక్షర దర్శిని):**నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజుకు చేరుకుంది. రెండో రోజు మొత్తం 20 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లా రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ మద్దతుదారులైన అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు చేరుకుని సంబంధిత అధికారులకు పత్రాలు సమర్పించారు.కలువాయి మండలంలో మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ల ప్రక్రియలో పాల్గొంటున్నట్లు కూటమి నాయకులు తెలిపారు. అయితే తెలుగురాయపురం, కుల్లూరు, మాదన్నగారిపల్లి ఎంపీటీసీ సెగ్మెంట్లలో రెండో రోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని, ఆయా స్థానాలకు గురువారం అభ్యర్థులు నామినేషన్లు సమర్పించనున్నట్లు వెల్లడించారు.

**నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత**

నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కలువాయి ఎస్ఐ కోటయ్య నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు అధికారులు, పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.







## పొదలకూరులో జోరుగా ఎంపీటీసీ నామినేషన్లు

- 19 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 75 నామినేషన్లు
- గురువారం ఒక్కరోజే 52 నామినేషన్ల దాఖలు
- వైసీపీ నుంచి 38, టీడీపీ నుంచి 35 నామినేషన్లు

**పొదలకూరు,(అక్షరదర్శిని):** పొదలకూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది. మండలంలోని 19 ఎంపీటీసీ స్థానాలకు గురువారం నాటికి మొత్తం 75 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం ఒక్కరోజే 52 నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికల సందడి మరింత ఊపందుకుంది.ఎన్నికల అధికారుల నివేదిక ప్రకారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 38, తెలుగుదేశం పార్టీ తరఫున 35, జనసేన పార్టీ నుంచి ఒకటి, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక నామినేషన్ దాఖలయ్యాయి. మొత్తం నామినేషన్లలో వైసీపీ స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం అభ్యర్థుల తుది పోటీపై స్పష్టత రానుంది.

## సర్వేపల్లిలో టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరికలు

మొదటి పేజీ తరువాయి





కార్యక్రమాలను అమలు చేస్తోందని, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. కోడూరు బీచ్ రోడ్డు నిర్మాణ పనులను రూ.4.50 కోట్లతో చేపడుతున్నామని తెలిపారు. కోడూరు పంచాయతీలోని లింక్ రోడ్లు, ఉప్పుకాలువపై వంతెన నిర్మాణం వంటి పనులను ప్రస్తావిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు లభిస్తుందని, విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో వివిధ పార్టీల నాయకుల చేరికలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి.

### నామినేషన్ల ప్రక్రియలో లోటుపాట్లకు తావివ్వొద్దు

- అధికారులకు జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సదా భార్గవి సూచన

**అల్లూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ స్థానాలకు జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సదా భార్గవి అధికారులకు సూచించారు. గురువారం అల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి నుంచి నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా నామినేషన్లను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ పరిశీలనలో నోడల్ అధికారి శోభారాణి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నెల్లూరులో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి





- రానున్న రెండేళ్లలో నగర రూపురేఖలు మారనున్నాయి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు మంత్రి పొంగూరు నారాయణ కృషి చేస్తున్నారని ఆయన కుమార్తె డాక్టర్ పొంగూరు సింధూర పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో నెల్లూరు నగర రూపురేఖలు మారేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు.గురువారం నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా 66, 67వ డివిజన్లలో ఆమె పర్యటించారు. 66వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి కప్పిర రేవతి, 67వ డివిజన్ అభ్యర్థి లక్ష్మీప్రసన్నను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.2014లో మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి, 2024లో మరోసారి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నెల్లూరు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని సింధూర పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇతర అభివృద్ధి పనులను కూడా చేపట్టినట్లు తెలిపారు. నగరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు చెప్పారు.

**టీడీపీ అభ్యర్థులను గెలిపించండి: మంత్రి నారాయణ** నెల్లూరు నగరంలో నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి నారాయణ పాల్గొని టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌తో పాటు 66వ డివిజన్ అభ్యర్థి కప్పిర రేవతి, 67వ డివిజన్ అభ్యర్థి లక్ష్మీప్రసన్నలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## అభివృద్ధి కొనసాగాలంటే కూటమికి మద్దతివ్వండి

మొదటి పేజీ తరువాయి

డివిజన్లలో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు.నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నట్లు కూటమి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బుచ్చిరెడ్డిపాళెం అభివృద్ధికి కూటమిని గెలిపించండి





- రూ.22 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**బుచ్చిరెడ్డిపాళెం,(అక్షర దర్శిని):** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీలో వీధివీధినా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అర్హులైన కుటుంబాలకు సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో రూ.22 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే పనులను మరింత వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని 15, 16, 17, 18వ వార్డుల్లో కూటమి నాయకులతో కలిసి 'చెప్పాం.. చేస్తున్నాం' పేరుతో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చైర్‌పర్సన్ అభ్యర్థి దొడ్ల విజయలక్ష్మి, 15వ వార్డు అభ్యర్థి మోర్ల మురళి, 16వ వార్డు అభ్యర్థి వింజం పద్మ, 17వ వార్డు అభ్యర్థి ఎరటపల్లి శివకుమార్ రెడ్డి, 18వ వార్డు టీడీపీ అభ్యర్థి చిలక ఉషలను గెలిపించాలని ఓటర్లను కోరారు.17వ వార్డులో రూ.1.69 కోట్లు, 16వ వార్డులో రూ.77.54 లక్షలు, 18వ వార్డులో రూ.79.67 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. స్థానికులు ప్రస్తావించిన రహదారులు, డ్రెయినేజీ, శ్మశానవాటిక ప్రహరీ, హాస్టల్ మరమ్మతులు తదితర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీర్ఘకాలంగా నిర్లక్ష్యానికి గురైన కిసాన్ సెజ్‌లో మళ్లీ కదలిక వచ్చిందని, కోవూరు యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.